క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

జాన్‌పేటలో నేత్రదానం



ఎల్లు వెంకయ్య (ఫైల్)

విడవలూరు : మండలంలోని జాన్‌పేట గ్రామంలో ఎల్లు వెంకయ్య(52) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు ఆయన నేత్రాలను సేకరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మనుబోలు : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాయుడుపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గొట్లపాళెం గ్రామానికి చెందిన వెందోడు శీనయ్య(35)కు ఐదేళ్ల క్రితం అనూషతో వివాహమైంది. మొదట్లో వారి కాపురం సజావుగానే సాగినప్పటికీ ఇటీవల కాలంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారి మధ్య మరోసారి గొడవ జరగడంతో నాయుడుపల్లి సమీపంలోని బండేపల్లి బ్రాంచ్ కాలువ వద్దకు శీనయ్య వెళ్లి తెగుళ్ల నివారణకు వాడే గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శీనయ్యకు భార్య అనూషతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- ట్రాన్స్‌కో చీఫ్ జీఎం ఆదిశేషయ్య



అధికారులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో చీఫ్ జీఎం

మనుబోలు : భారీ వర్షాల కారణంగా తలెత్తే విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ట్రాన్స్‌కో చీఫ్ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆయన మనుబోలు సబ్‌స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించుకునేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నచోట ముందుగానే వాటిని కొట్టించివేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడేవారు టోల్‌ఫ్రీ నంబర్‌లు 1912 లేదా 1800425155333 లేదా వాట్సాప్ నంబర్ 91333 31912కు కాల్ చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ ప్రసాద్, ఏఈ అనిల్‌కుమార్, నరేంద్రరెడ్డి, శేషాద్రి, సబ్ ఇంజినీర్ నాగార్జున ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవాలు



కాళీమాత గ్రామోత్సవం



కోదండరామపురంలో..

మనుబోలు : మండల కేంద్రంలో దసరా ముగింపు ఉత్సవాలను సోమవారం అర్ధరాత్రి తరువాత అంగరంగ వైభవంగా నిర్వహించారు. మనుబోలులో అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ, కోదండరామపురంలో సాయిశర్మ దసరా చావిళ్ల వద్ద అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు జరిపించారు. అనంతరం కాళికాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మనుబోలులో అమ్మవారి వద్ద ఉంచిన లడ్డూకు వేలం వేయగా రూ.18 వేలకు కాంద్ర బ్రదర్స్, నగదు మాలను రూ.24 వేలకు పొట్టి నాగేంద్ర దక్కించుకున్నారు.

బాబోయ్.. కుక్కలు

వీధికుక్కలు సాధారణ రోజులతో పోలిస్తే వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా మారుతాయి. వీటి కాటుకు గురైతే ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం అధికంగా ఉంటుంది. వ్యాక్సిన్ వేసుకున్నా కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్ బారిన పడి అనారోగ్యాల పాలు అవుతారు. ప్రస్తుత తరుణంలో అధికారులు వేగంగా స్పందించి వీధికుక్కలను పట్టి ఊరికి దూరంగా వదలాలని ప్రజలు కోరుతున్నారు.

- గ్రామాల్లో వీధికుక్కల స్వైర విహారం
- వర్షాకాలంలో మరింత ప్రమాదకరం
- నానాటికీ పెరుగుతున్న కుక్క కాటు బాధితులు



కొడవలూరు సెంటర్‌లో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు



కొడవలూరు దర్గా సంఘం వద్ద మెయిన్ రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

కొడవలూరు : మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నియంత్రణను పంచాయతీల పాలకులు గాలికొదిలేయడంతో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. వీధుల్లో మాటేసి కాటేస్తుండడంతో కాలినడకనే కాకుండా బైక్‌లపై వెళ్లే వారు కూడా బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొడవలూరు పీహెచ్‌సీకి నెలకు 18 నుంచి 22 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

కుక్కల నియంత్రణ గాలికి..

మండలంలో ప్రతి గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కొత్తగా ఏదైనా ప్రాంతానికి వెళ్లి కుక్క కాటుకు గురవ్వకుండా తిరిగి వస్తామనే నమ్మకం లేకుండాపోయింది. మెయిన్ రోడ్లపై బైక్‌లపై వెళ్తున్న వారిని వెంబడించి మరీ కాటేస్తున్నాయి. వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనాలకు అడ్డు వస్తుండడంతో పడిపోయి గాయపడుతున్నారు. వీధికుక్కల నియంత్రణ బాధ్యత పంచాయతీలపై ఉంది. గతంలో కుక్కలను పట్టి చంపేయడం ద్వారా నియంత్రించేవారు. ఈ పద్ధతి హింసాత్మకంగా ఉందని జంతు సంరక్షణ సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో పదేళ్ల క్రితం నుంచే వీధి కుక్కల నియంత్రణకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. కుక్కల బెడద ఎక్కువగా ఉన్న చోట పంచాయతీలు బాధ్యత తీసుకుని వాటిని పట్టి నెల్లూరులోని జిల్లా పశు వైద్యశాలలో ప్రత్యేక కేంద్రానికి తీసుకుపోయి పునరుత్పత్తి నిరోధక శస్త్రచికిత్సలు చేయించాలి. తిరిగి వాటిని ఊరికి దూరంగా విడిచి పెట్టాలి. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయి. కానీ ఆ దిశగా పంచాయతీ అధికారులు యత్నిస్తున్న దాఖలాల్లేవు. ఫలితంగా కుక్క కాటు బాధితులు నానాటికీ పెరుగుతున్నారు. గతంలో పిల్లల ప్రాణాలను బలితీసుకున్న సంఘటనలు కూడా రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం వీటి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం శోచనీయం.

కుక్కలను నియంత్రించాలి



బైక్‌పై వస్తుండగా గ్రామ ప్రారంభంలో కుక్కలు గుంపులుగా అడ్డుగా వచ్చాయి. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి నాతో పాటు బైక్‌పై ఉన్న స్నేహితుడు గాయపడ్డాం. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉంటున్నాయి. ఈ సమస్య నుంచి విముక్తి కలగాలంటే కుక్కల పునరుత్పత్తి నియంత్రణ చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రాణాపాయ ఘటనలు జరిగే ప్రమాదం ఉంది.

– షేక్ అప్సర్‌బాషా, వీధి కుక్క బాధితుడు, కొడవలూరు

జాగ్రత్తగా ఉన్నా కాటు తప్పడం లేదు



నా చిన్న వయస్సులో కుక్క కాటుకు గురయ్యాను. అప్పట్నుంచి వీధి కుక్కల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉంటున్నా. అయినప్పటికీ ఇటీవల సైకిల్‌పై నిదానంగా వెళ్తున్నప్పుడు మాటు వేసి ఎలాంటి చప్పుడు చేయకుండా వచ్చి కాటు వేసింది. కుక్క కరుస్తుందని పసిగట్టేలోపే కాటుకు గురయ్యాను. యాంటీ రేబిస్ ఇంజెక్షన్‌లు క్రమం తప్పకుండా వేయించుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది.

– తలపల వేణుగోపాల్, కుక్క కాటు బాధితుడు

ఫిర్యాదు చేస్తే చర్యలకు ఆదేశిస్తా



ఏ గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత కార్యదర్శిని నియంత్రించాలని ఆదేశిస్తాం. ఇందుకోసం ఓ ప్రత్యేక సంస్థ పనిచేస్తుంది. వారి సాయంతో వాటిని పట్టి నెల్లూరులోని ప్రత్యేక కేంద్రానికి తరలించి పునరుత్పత్తి లేకుండా శస్త్రచికిత్స చేయించి మరలా యథా స్థానంలో వదిలేస్తాం. దీనివల్ల క్రమేణ వీధి కుక్కల ఉత్పత్తి తగ్గుతుంది.

– ఏవీ.సుబ్బారావు, ఎంపీడీఓ, కొడవలూరు

బాధితులు అధికమే



ఆస్పత్రికి కుక్కకాటు బాధితులు తరచూ వస్తూనే ఉంటారు. నెలకు 18 నుంచి 22 మంది వరకు వస్తుంటారు. వీరు కాకుండా కుక్కల కారణంగా ప్రమాదాలకు గురై గాయపడిన వారు కూడా వస్తుంటారు. వీరికి సంబంధించిన చికిత్స చేసి పంపుతున్నాం. కుక్క కాటుకు సంబంధించిన ఇంజెక్షన్‌లు పీహెచ్‌సీలో అందుబాటులో ఉండడం వల్ల కాటుకు గురైన అందరికీ వేస్తున్నాం.

– ఎం.రామకృష్ణ, వైద్యాధికారి, కొడవలూరు

వెండి కవచం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండ రామస్వామి దేవస్థానంలో ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం వెండి సర్వాంగ కవచాన్ని భక్తులు సమర్పించారు. అత్తిపల్లి కృష్ణమోహన్‌రెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, బద్దిపూడి శ్రీనివాసులురెడ్డి, ఏల్చూరు సురేష్, సరాబు సురేష్, పడిదం ప్రసాద్, పడిదం సురేష్, రేబాల వెంకటకృష్ణారెడ్డి, ఏటూరు గాయత్రి, తిరుపతి సుకుమార్‌లు వెండి కవచాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధర్మకర్త మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు అందుబాటులో ఉండాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఇందుకూరుపేట : అత్యవసర సేవలు అందించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య అన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన మందులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైతే వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నాలుగు రోజుల్లో ప్రసవించే గర్భిణులను వైద్యశాలలో ఉంచి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ ప్రమోద్, హెచ్‌ఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి నగదు విరాళం



నగదు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఫ్లోరింగ్ పనుల కోసం పట్టణానికి చెందిన పోతురాజు రమేష్–కల్పన దంపతులు మంగళవారం రూ.లక్ష నగదు విరాళాన్ని అందజేశారు. దేవస్థానంలో ఫ్లోరింగ్‌ను స్టోన్స్‌తో పూర్తి చేసేందుకు నిర్మాణ కమిటీ రూ.30 లక్షలు అంచనా వేశారు. కాగా ముందుగా రమేష్ తన వంతు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు. దాతలు ముందుకు రావాలని కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎం.శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, బొప్పా వెంకటేశ్వర్లు, విష్ణు, హరిబాబు, పోతురాజు రామ్మోహన్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతంలో వైద్య పరీక్షలు



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కొడవలూరు : సురక్షిత ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న గిరిజనులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. భారీ వర్షాల దృష్ట్యా నార్తురాజుపాళెంలోని వినాయక నగర్ గిరిజన కాలనీ వాసులను అధికారులు స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు సోమవారం తరలించడం తెలిసిందే. ఈ క్రమంలో ఆశ్రయం పొందుతున్న గిరిజనుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారి ఎం.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. జ్వరాలు, తదితర సీజనల్ వ్యాధులున్నాయా.. అని పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత కేంద్రంలోని గిరిజనులంతా ఆరోగ్యకరంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్‌ఎంలు దీనమ్మ, సలోమి, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ పాల్గొన్నారు.

వరి వంగడాల ఎంపిక కీలకం



పొదలకూరు : నిమ్మతోటలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

- ఏడీఏ శివనాయక్

పొదలకూరు : సాగులో వరి వంగడాల ఎంపిక కీలకమని, రైతులు మేలైన వరి వంగడాలను ఎంపిక చేసుకుని నార్లు పోసుకోవాల్సిందిగా పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) కె.శివనాయక్ సూచించారు. మండలంలోని వావింటపర్తి, దుగ్గుంటరాజుపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి చేసి నార్లు పోస్తే నెలరోజు పాటు పంటను తెగుళ్ల ఆశించవని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలని, పైపాటుగా వేయరాదన్నారు. ఉద్యానాధికారి ఈ.ఆనంద్ ప్యాక్‌హౌస్‌లు, ఇంప్లిమెంట్ల సబ్సిడీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ జయలక్ష్మి, వీపీఏలు శ్రీనివాసతేజ, అశ్విని, వెటర్నరీ అసిస్టెంట్ దివ్య, రైతు పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : ముంగళదొరువు గ్రామంలో..

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : వరి సాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని ముంగళదొరువు రైతుసేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందని, పచ్చిరొట్ట విత్తనాలైన సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. సాగుకు ముందు విత్తన శుద్ధి చేపడితే చీడపీడలను నివారించవచ్చన్నారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ నాయక్, మండల ఏఓ శిరీషారాణి, వీపీఏలు అనూష, కుసుమ, ఏఈఓ నవీన్, వీఎఫ్‌ఏ రమణమ్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు : నరుకూరు సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా మార్చాలని, లేకుంటే సహించేది లేదని సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం నరుకూరు సెంటర్‌లోని మద్యం షాపు ఎదుట నిరసన చేపట్టారు. మెయిన్ సెంటర్‌లో మద్యం దుకాణం ఉండడం వల్ల విద్యార్థులు, పెద్దలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల సభ్యులు కాల్తిరెడ్డి రమణమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి రాజా, నాయకులు పచ్చా మధు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వెంకటేశ్వర విద్యార్థుల ప్రతిభ

కొడవలూరు : అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలకు నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పోటీల్లో వీరు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్‌కు పి.వెంకటేష్, క్రికెట్‌కు పి.అజిత్‌బాబు, ఖోఖోకు కె.రాంగోపాల్, ఎస్కే.ఫరియాలు ఎంపికయ్యారు. వీరు త్వరలో జేఎన్‌టీయూ అనంతపురం జట్టు నుంచి పాల్గొంటారు. ఈ క్రమంలో వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.



స్ఫూర్తిదాయకం అబ్దుల్ కలామ్ జీవితం



జయంతి వేడుకల్లో ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ శాస్త్రవేత్తగానే కాకుండా భారత రాష్ట్రపతిగా ఎంతో మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. దేశాభివృద్ధికి అబ్దుల్ కలామ్ చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన భారీ వర్షాలు

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. నేడు(బుధవారం) భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కాగా తీరప్రాంత గ్రామాల్లో చలిగాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు వేటకు విరామం పలికారు.



కోవూరు : పడుగుపాడులో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



ఇందుకూరుపేట : మైపాడు తీరంలో కసురుగా ఉన్న సముద్రం

కోవూరు : మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసింది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలాధికారులు సూచిస్తున్నారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ చెర్లోపాళెం, పోతిరెడ్డిపాళెం గ్రామాలను సందర్శించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు.

కసురుగా సముద్రం

ఇందుకూరుపేట : అల్పపీడన ప్రభావంతో సముద్రం కసురుగా ఉంది. అలలు ఓ మోస్తరుగా ఎగసిపడుతున్నాయి. ఎడతెరిపిలేని వర్షం కురిసినా.. మధ్యాహ్నానికి కాస్త ఊరటనిచ్చింది. సుమారు రెండు గంటల తరువాత మళ్లీ యథాప్రకారం జోరు వాన కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో పలు రహదారులు జలమయమైంది.

అప్రమత్తంగా ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి ప్రజలకు సూచించారు. మండలంలోని కాగులపాడు, దామరమడుగు గ్రామాల్లోని పలు ఎస్టీ కాలనీల వద్దకు మంగళవారం వెళ్లి పలు జాగ్రత్తలు వివరించారు. ఎలాంటి సహాయం కావాలన్నా తమ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. వరదొస్తే సమీప ప్రాంతాల్లోని సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని వివరించారు.

పొదలకూరులో భారీ వర్షం

పొదలకూరు : మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. సోమవారం కురిసిన వర్షపాతాన్ని అధికారులు మంగళవారం నమోదు చేశారు. 70.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఓ ఎ.వాసు వెల్లడించారు.

పొంగి ప్రవహిస్తున్న ఆల్తుర్తి వాగు

మండలంలోని ఆల్తుర్తి గ్రామ సమీపంలో నావూరుకు వెళ్లే మార్గంలో పెద్దవాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం ఆల్తుర్తి మార్గంలో నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామస్తులు వెళ్లకుండా రాకపోకలను నిలిపివేశారు. సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై హనీఫ్, గ్రామ సర్పంచ్ ఖాదర్‌బాషా, సెక్రటరీ సురేష్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ముత్తుకూరులో కంట్రోల్ రూమ్

ముత్తుకూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే పరిస్థితి ఏర్పడడంతో మంగళవారం సముద్రం అల్లకల్లోలంగా తయారైంది. ఉవ్వెత్తున అలలు ఎగసిపడడం వల్ల మత్స్యకారులు చేపలవేటను ఆపేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. మరోవైపు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వీఆర్వోలు, ఇతర సిబ్బంది గ్రామాల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితి తెలియజేయాలని కోరారు. అవసరమైతే లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

తీరంలో చలిగాలులు

తోటపల్లిగూడూరు : మండల పరిధిలో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంత గ్రామాలు భారీ వర్షాలతో పాటు చలిగాలులకు వణికిపోయింది. కాగా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తుఫాన్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

కొలనకుదురులో పర్యటన

మనుబోలు : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య సూచించారు. మండలంలోని తీరప్రాంత గ్రామమైన కొలనకుదురులో మంగళవారం పర్యటించి లోతట్టు ప్రాంతాలను, తుఫాన్ షెల్టర్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ వర్షం అధికమైతే లోతట్టు ప్రాంతాల వారిని తుఫాను షెల్టర్‌కు తరలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట వీఆర్వో నాగేశ్వరరావు ఉన్నారు.



మనుబోలు : అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బయ్య



పొదలకూరు : వాగును పరిశీలిస్తున్న అధికారులు



తోటపల్లిగూడూరు : కాలువను తలపిస్తున్న నరుకూరు–కోడూరు రహదారి